సాక్షి నిర్మల్

సోమవారం । 3 । మార్చి । 2025



ఔట్ సోర్సింగ్ గందరగోళం

ఆర్టీసీలో కాంట్రాక్ట్ డ్రైవర్ల నియామకంపై గందరగోళం నెలకొంది. అధికారిక ప్రకటన జారీ కాకున్నా ఔట్ సోర్సింగ్ సంస్థలు పోస్టుల భర్తీకి అత్యుత్సాహం చూపాయి. 8లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ: 6:19	మంగళ: 5:16

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.0 / 22.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణ పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని పోలీస్ సాయుధ దళ ముఖ్య కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాంనిరంజన్ రావు, శేఖర్, రమేశ్, రామకృష్ణ, ఆర్ఎస్సైలు వినోద్, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

'అడెల్లి'లో భక్తుల రద్దీ



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం ఆలయ ఈవో రమేశ్ అన్ని వసతులు కల్పించారు. స్థానిక ఎస్సై శ్రీకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గజ్జలమ్మదేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుస్వామి కదార్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలిపోతున్న 'హరిత' మొక్కలు



కాలిపోయిన మొక్కలు

కడెం: మండలంలోని పెద్దూర్, ధర్మాజీపేట్, నచ్చన్ఎల్లాపూర్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలు అటవీశాఖ సిబ్బంది పెట్టిన ఫైర్‌లైన్స్ మంటల్లో కాలిబూడిదవుతున్నాయి. చెట్లను కాపాడాల్సిన అటవీ శాఖ చర్యలతో మొక్కలు అగ్గిపాలు కావడంపై ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అటవీ అధికారులు స్పందించి మొక్కలను రక్షించాలని కోరుతున్నారు.

డీటీఎఫ్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

నిర్మల్ రూరల్: డీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా చంద్ర నాగకాంత్, ఉపాధ్యక్షులుగా రమేశ్, శకుంతల, ప్రధాన కార్యదర్శులుగా మహేంద్రాచారి, గొలుసుల నర్సయ్య, శ్రీనివాస్, దుర్గం సుగుణాకర్, రాష్ట్ర కౌన్సిలర్‌గా దేశ్‌పాండే మధుసూదన్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా దళితానంద్, సభ్యులుగా దత్తాద్రి, లాలు ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటామని వారంతా హామీ ఇచ్చారు.

బియ్యం డబ్బులేవి?



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం (ఫైల్)

- పట్టుకున్న పీడీఎస్ రైస్‌కు వేలం
- 360 క్వింటాళ్లకు రూ.11.16 లక్షలు
- దక్కించుకున్న మహారాష్ట్ర వ్యక్తి
- పైకం చెల్లించడంలో తాత్సారం
- అధికారుల తీరుపై అనుమానం!

భైంసాటౌన్: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని వేలం వేసిన అధికారులు దక్కించుకున్న వ్యక్తి నుంచి గడువులోపు డబ్బులు రాబట్టడంలో విఫలమయ్యారు. సదరు వ్యక్తి పన్నాగాన్ని పసిగట్టలేక పోతున్న అధికారుల తీరుపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇటీవల మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి లారీలో పీడీఎస్ బియ్యం తరలిస్తూ భైంసా పట్టణంలో కారును ఢీకొన్న ప్రమాదంలో పట్టుబడిన విషయం తెలిసిందే. దీంతో ఎస్పీ జానకీ షర్మిల ప్రత్యేక దృష్టి సారించి అక్రమదందా గుట్టురట్టు చేశారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి జిల్లా నుంచి పీడీఎస్ బియ్యం సేకరించి తిరిగి జిల్లాకే తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ధర్మాబాద్‌లోని అతడి స్థావరంపై దాడి చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు కూడా నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న 360 క్వింటాళ్ల బియ్యానికి రెవెన్యూ అధికారులు ఇటీవల బహిరంగ వేలం నిర్వహించారు. ధర్మాబాద్‌కే చెందిన ఓ వ్యక్తి క్వింటాల్‌కు రూ.3,100 చొప్పున బియ్యం దక్కించుకున్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నా.. వేలంలో దక్కించుకున్న బియ్యానికి సంబంధించి ఈనెల 24లోపు రూ.11.16లక్షలు చెల్లించాల్సి ఉంది. కానీ, సదరు వ్యక్తి ఇప్పటివరకు డబ్బులు చెల్లించకుండా తాత్సారం చేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు అడిగితే రేపు, మాపంటూ జాప్యం చేస్తున్నట్లు తెలిసింది.

ఆంతర్యమేమిటంటే..?

మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా పీడీఎస్ బియ్యం అక్రమదందా యథేచ్ఛగా సాగిస్తున్నాడు. జిల్లా నుంచి ఏజెంట్ల ద్వారా బియ్యం సేకరించి తిరిగి లారీల్లో జిల్లాలోని రైస్‌మిల్లులు, ఇతరులకు పంపుతున్నాడు. ఈ దందాలో ఆరితేరిన సదరు వ్యక్తి రూ.కోట్లు ఆర్జించినట్లు ఆరోపణలున్నాయి. గతంలో భైంసా మండలంలోని దేగాంలోనూ ఇతనికి చెందిన పీడీఎస్ బియ్యం దాదాపు 270 క్వింటాళ్లు పట్టుబడగా, అప్పుడు కూడా పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరిచారు. కానీ, కొద్దిరోజులకే బియ్యం రిలీజ్ చేయించుకున్నాడు. ఈసారి కూడా ఆ పద్ధతిలోనే బియ్యం రిలీజ్ చేయించుకునేందుకు యత్నించినట్లు తెలిసింది. కాగా, రెవెన్యూ అధికారులు బహిరంగ వేలం నిర్వహించడంతో అతడి పన్నాగం ఫలించలేదు. అయినా, బియ్యం దక్కించుకునేందుకు ధర్మాబాద్‌కు చెందిన అతని వ్యక్తినే వేలంలోకి దింపినట్లు తెలిసింది. కాగా, వేలానికి ఒకరోజు ముందు ప్రభుత్వ ధరను క్వింటాల్‌కు రూ.2,100కు నిర్ణయించేలా సదరు వ్యాపారి ఎత్తుగడ వేసినట్లు సమాచారం. ఇందుకుగాను పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులతోనూ రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. వారు ససేమిరా అనడంతో కిలోకు రూ.25 నుంచి వేలం ప్రారంభించారు. పోటీగా మరో ఇద్దరు పాల్గొనడంతో రూ.31కి కిలో చొప్పున దక్కించుకున్నాడు. కానీ, గడువులోపు డబ్బులు చెల్లించకుండా జాప్యం చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తక్కువ ధరకు కొట్టేసే యత్నం

వేలంలో బియ్యం దక్కించుకున్న వ్యాపారి ఏజెంట్ల ద్వారా కిలోకు రూ.25 నుంచి రూ.27వరకు సేకరిస్తుంటాడు. కానీ, గిట్టుబాటు కాకున్నా వేలంలో రూ.31కి దక్కించుకోవడంపై సందేహాలు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరి బియ్యం రిలీజ్ చేయించుకునేందుకు తెరవెనుక యత్నిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవున్నాయి. జాప్యం చేయడం ద్వారా ఎలాగైనా బియ్యాన్ని తక్కువ ధరకు దక్కించుకోవడం లేదా రిలీజ్ చేయించుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, సంబంధిత అధికారులు ప్రస్తుత వేలానికి సంబంధించిన డబ్బులు త్వరగా వసూలు చేయాలి. లేదా మరోసారి వేలం నిర్వహించి వెంటనే డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో సదరు వ్యాపారి ఎత్తుగడ ఫలించి బియ్యం గతంలోలాగా చేజిక్కుంచుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తగిన చర్యలు తీసుకుంటాం

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఫిబ్రవరి 22న వేలం నిర్వహించాం. ధర్మాబాద్‌కు చెందిన వ్యక్తి కిలోకు రూ.31 చొప్పున రూ.11.16లక్షలకు దక్కించుకున్నాడు. అదే నెల 24లోపు చెల్లించాలని గడువు విధించినా ఇప్పటివరకు చెల్లించలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.

– ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్, భైంసా

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం

- ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెంచుతాం
- పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో డీఐఈవో



పరశురాం, డీఐఈవో

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈసారి మెరుగైన ఫలితాలు సాధిస్తామని డీఐఈవో పరశురాం పేర్కొన్నారు. ఈ నెల 5నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

సాక్షి: ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఐఈవో: ఉత్తీర్ణత శాతం పెరుగుదలకు 90రోజుల ప్రణాళికను ఫిబ్రవరి 20 వరకు అమలు చేశాం. అధ్యాపకులు ప్రతీరోజు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు బోధించారు. వెనుకబడిన, గైర్హాజరైన విద్యార్థులపై దృష్టి సారించారు. విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రతీరోజు హాజరయ్యేలా చూశారు. దసరా సెలవుల తర్వాత సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు ప్రత్యేక అధ్యయన తరగతులు, పునఃశ్చరణ, స్లిప్ టెస్ట్‌లు కూడా నిర్వహించారు. ఈ ప్రణాళిక సత్ఫలితాలనిస్తుందని ఆశిస్తున్నాం.

సాక్షి: జిల్లాలో ఎన్ని పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్య ఎంత?

డీఐఈవో: జిల్లాలో మొత్తం 23 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశాం. 13,133 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 6,571 మంది ఫస్టియర్ విద్యార్థులు కాగా, 6,562 మంది సెకండియర్ విద్యార్థులున్నారు. ఫస్టియర్ ఒకేషనల్‌లో 1,088, సెకండియర్‌లో 945 మంది విద్యార్థులున్నారు. ఉదయం 9నుంచి 12 గంటల వరకు పరీక్షలుంటాయి.

సాక్షి: పరీక్షల నిర్వహణకు ఎంతమంది సిబ్బందిని నియమించారు?

డీఐఈవో: పరీక్షల నిర్వహణకు 23 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 23 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ప్రతీ 40 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌తోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంను నియమించాం. ఈ టీంలో ఒక డిప్యూటీ తహసీల్దార్, ఎస్సై, ఏఎస్సై, సీనియర్ లెక్చరర్లు సభ్యులుగా ఉంటారు.

సాక్షి: పరీక్షల నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

డీఐఈవో: పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించాం. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులతో పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంపై సమీక్ష నిర్వహించాం. పరీక్షల కమిటీని నియమించాం. ప్రతీ పరీక్షాకేంద్రంలో మూడు నుంచి నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. విద్య, పోలీస్, ఆరోగ్యశాఖల అధికారుల సహకారం తీసుకుంటున్నాం.

సాక్షి: విద్యార్థుల ప్రగతిని ఎలా అంచనా వేస్తున్నారు?

డీఐఈవో: ఈ విద్యా సంవత్సరంలో నాలుగు యూనిట్, అర్ధ వార్షిక, రెండు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాం. ఇటీవల ప్రాక్టికల్ పరీక్షలు కూడా పూర్తయ్యాయి. పరీక్షలకు విద్యార్థులంతా హాజరయ్యేలా చూశాం. సమాధాన పత్రాలను ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేశాం. పరీక్షా ఫలితాలను సమీక్షించి విద్యార్థులకు తగిన సూచనలు చేశాం. ఈ విధానంతో జిల్లాలో ఈసారి ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం మరింత మెరుగవుతుందని ఆశిస్తున్నాం.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు బాసట

- రూ.5లక్షల చొప్పున పరిహారం
- మంజూరు చేసిన రాష్ట్ర సర్కారు



నిర్మల్‌ఖిల్లా: రెక్కాడితే గాని డొక్కాడని దిగువ మధ్యతరగతి కార్మికులు ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్నారు. అనుకోని ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో పలువురు అక్కడ మృతి చెందితే వారి మృతదేహాల కోసం బాధిత కుటుంబాలు నెలల తరబడి వేచి చూస్తున్న ఘటనలనేకం. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలకు వెళ్లి మత్యువాత పడుతున్న వలస కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు చాలా ఏళ్లుగా పోరాడుతున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో గల్ఫ్ మృతుడి కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం ఇచ్చేందుకు గతంలోనే ఉత్తర్వులిచ్చింది. ఇటీవల నిధులు విడుదల చేసింది. నిర్మల్ జిల్లాకు రూ.25లక్షలు, మంచిర్యాల జిల్లాకు రూ.15లక్షల నిధులు మంజూరు చేసింది.

జిల్లాలో గల్ఫ్ గాయాలెన్నో..

ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి వివిధ కారణాలతో పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయి. వారి కష్టాల గురించి 'సాక్షి'లో ఎన్నో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక జీవో 205 విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం డిసెంబర్–2003 నుంచి ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన వారి కుటుంబానికి రూ.5లక్షలు అందించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాల్లో దాదాపు 60 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నట్లు గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. కాగా, ఏటా పదుల సంఖ్యలో వివిధ కారణాలతో మృత్యువాత పడుతున్నారు.


'ప్రవాసీ ప్రజావాణి'లో వినతులు

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల కార్మికులు, ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' ఫిర్యాదుల స్వీకరణ కేంద్రాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దీనిని నిర్వహిస్తున్నారు. దీనిని ప్రారంభించిన మొదటిరోజే జిల్లా నుంచి మృతుల కుటుంబసభ్యులు పలువురు వినతిపత్రాలు అందించారు. గల్ఫ్, ఇతర దేశాల్లో ఉన్న కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్ 16న జారీ చేసిన జీవో 205కు కొనసాగింపుగా, సాధారణ పరిపాలన శాఖలోని ప్రవాస భారతీయుల (జీఏడీ–ఎన్నారై) విభాగం పక్షాన ప్రవాసీ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి సంస్థాగతంగా పటిష్ట చర్యలు తీసుకుంటోంది.

ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదల

2023 డిసెంబర్ 7నుంచి ఇప్పటివరకు గల్ఫ్‌దేశాల్లో 200 మందికి పైగా తెలంగాణ కార్మికులు మృతి చెందినట్లు అంచనా వేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు కోసం తెలంగాణ ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం ఈనెల 1న 113 కుటుంబాలకు రూ.5.65కోట్లు వివిధ జిల్లాలకు విడుదల చేసింది. ఇందులో నిర్మల్ జిల్లాకు రూ.25లక్షలు, మంచిర్యాల జిల్లాకు రూ.15లక్షలు కేటాయించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ప్రత్యేక ఆదేశాల ద్వారా త్వరగా పరిహారాన్ని బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. గల్ఫ్ మృతుల సంఖ్య ప్రకారం అన్ని జిల్లాలకు విడతల వారీగా మరిన్ని నిధులు కేటాయించనున్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా



ఉపాధి కోసం ఎడారి దేశాల బాట పడుతున్న కార్మికులెందరో విగత జీవులుగా స్వస్థలాలకు వస్తున్న దయనీయ దృశ్యాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తరచూ కనిపిస్తాయి. కొన్నిసార్లు మృతదేహాల కోసం నెలల తరబడి వేచి చూస్తున్న ఘటనలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం భరోసానిస్తోంది. విడతల వారీగా జిల్లాలోని బాధిత కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తోంది.

– స్వదేశ్ పరికిపండ్ల, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రవాసీమిత్ర కార్మికసంఘం

గెలుపెవరిదో?

- 'ప్రాధాన్యత' దక్కేదెవరికో?
- నేడు 'ఎమ్మెల్సీ' ఓట్ల లెక్కింపు
- కరీంనగర్‌లో కౌంటింగ్
- ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ
- విజయంపై ప్రధాన పార్టీల ధీమా

పట్టభద్రుల నియోజకవర్గంలో..	
బరిలో నిలిచిన అభ్యర్థులు	: 56
మొత్తం ఓట్లు	: 3,55,109
పోలైన ఓట్లు	: 2,50,328
పోలింగ్ శాతం	: 70.48
టీచర్స్ నియోజకవర్గంలో..	
బరిలో నిలిచిన అభ్యర్థులు	: 15
మొత్తం ఓట్లు	: 27,088
పోలైన ఓట్లు	: 24,968
పోలింగ్‌శాతం	: 92.17



మాక్ కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కైలాస్‌నగర్: శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మరికాసేపట్లో షురూ కానుంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో సోమవారం నిర్వహించే మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌కు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గెలుపెవరిదో అనే దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది బరిలో నిలిచినా ప్రధాన పోటీ మాత్రం బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థుల మధ్యనే ఉంటుందని తెలుస్తోంది. టీచర్స్ ఎమ్మెల్సీ ఫలితం తొలుత వెల్లడి కానుండగా పట్టభద్రుల కౌంటింగ్ ఆలస్యమయ్యే అవకాశముంది.

తొలి ఫలితం టీచర్స్ ఎమ్మెల్సీదే

టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో బీజేపీ తరఫున మల్క కొమురయ్య బరిలో నిలువగా, ఉపాధ్యాయ సంఘాల్లో ప్రధానమైన పీఆర్‌టీయూ టీఎస్ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్ పక్షాన అశోక్‌కుమార్ బరిలో నిలిచారు. ఇతర అభ్యర్థులు వివిధ సంఘాల మద్దతుతో బరిలో నిలిచినా ప్రధాన పోటీ మాత్రం ఈ ముగ్గురి మధ్యనే ఉండనున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికలను పరిశీలిస్తే పీఆర్‌టీయూ మద్దతుదారులే విజయం సాధించిన సందర్భాలున్నాయి. ఈ ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం అవుతుందా.. లేక రాజకీయంగా ఉత్సాహంగా ఉన్న బీజేపీ అభ్యర్థి విజయం సాధిస్తాడా.. లేదంటే అశోక్ కుమార్ గెలుస్తాడా? అనే దానిపైనా ప్రధాన చర్చ సాగుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల కంటే ఈ ఎన్నికను ఆయా ఉపాధ్యాయ సంఘాలే ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. విస్తృతంగా ప్రచారం చేపట్టాయి. ఉపాధ్యాయ ఓటర్లను కలుస్తూ మద్దతు కోరడంతో పాటు విందులు కూడా ఏర్పాటు చేశాయి. పోలింగ్ సరళి సాగిన తీరుపై ఆయా సంఘాలు తమ అభ్యర్థి గెలుపుపై పక్కా లెక్కలు వేసుకుంటున్నాయి. పట్టభద్రులతో పోల్చితే ఓటర్లు తక్కువగా ఉన్న టీచర్స్ ఎమ్మెల్సీ ఫలితమే ముందుగా వచ్చే అవకాశముంది. అయితే తొలి ప్రాధాన్యత ఓట్లతోనే ఫలితం వెల్లడవుతుందా? లేదా రెండో ప్రాధాన్యత ఓట్లు అనివార్యం కానున్నాయా? అనేది మరికాసేపట్లో తేలనుంది. మొత్తానికి అటు పట్టభద్రులు, ఇటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితంపై అన్నివర్గాల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తుండటం ఆసక్తి రేపుతోంది.

లెక్కింపు గణాంకాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సోమవారం మొదలు కానుంది. కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఉదయం 8 గంటలకు గ్రాడ్యుయేట్, టీచర్ నియోజకవర్గాలకు లెక్కింపు జరగనుంది. ఇందుకోసం మొత్తం 35 టేబుళ్లు వినియోగించనున్నారు. ఇందులో 21 పట్టభద్రుల ఓట్ల కోసం, 14 టేబుళ్లు ఉపాధ్యాయుల ఓట్ల కోసం కేటాయించారు. ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. వీరిలో ఒక మైక్రోఅబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు లెక్కింపు అసిస్టెంట్లు ఉంటారు. వీరందరికీ శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత అధికారులు శిక్షణ ఇచ్చారు. లెక్కింపు కోసం మొత్తం 800 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఇందులో 20 శాతం రిజర్వ్ సిబ్బందిని నియమించారు. ఆదివారం మాక్ కౌంటింగ్‌ను ఎన్నికల అధికారులు చేపట్టారు. ఈ ప్రక్రియను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు.

వేదిక: అంబేడ్కర్ స్టేడియం, కరీంనగర్
మొత్తం టేబుళ్లు: 35
పట్టభద్రుల టేబుళ్లు : 21
టీచర్ల టేబుళ్లు : 14
లెక్కింపు సిబ్బంది: 800
రిజర్వ్ స్టాఫ్: 20 శాతం

ఆ ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది పోటీ పడ్డారు. ఇందులో ప్రధానంగా కాంగ్రెస్ నుంచి వూట్కూరి నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి చిన్నమైల్ అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి బరిలో నిలిచిన ప్రసన్న హరికృష్ణ మధ్యే ప్రధాన పోటీ ఉండనున్నట్లు తెలుస్తోంది. స్వతంత్రుల్లో గట్టి పోటీనిచ్చే వారు లేకపోవడంతో పట్టభద్రులు ప్రధాన పార్టీల అభ్యర్థులకే మద్దతునిచ్చినట్లుగా పోలింగ్ సరళి స్పష్టం చేస్తోంది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో తమదే ఆధిక్యత ఉంటుందని బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో బరిలో లేకున్నా బీఎస్పీ నుంచి పోటీ చేసిన హరికృష్ణకు అంతర్గతంగా మద్దతునిచ్చినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఈ ముగ్గురిలో తొలి ప్రాధాన్యత ఎవరికి దక్కనుందో అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆయా పార్టీలతో పాటు ఓటర్లు కూడా తమ మద్దతుదారుల గెలుపునకున్న అవకాశాలు బేరీజు వేసుకుంటున్నారు. అయితే తొలి ప్రాధాన్యత ఓట్లతోనే ఫలితం తేలుతుందా? లేదా రెండో ప్రాధాన్యత అవసరం ఉంటుందా? అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

పునరావాస కల్పనలో విఫలం



గ్రామస్తులతో మాట్లాడుతున్న వేదిక సభ్యులు

కడెం: పులుల సంరక్షణ పేరిట అమాయక గిరిజన కుటుంబాలను ఇతర ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు ఆరోపించారు. మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాన్ని ఆదివారం మానవ హక్కుల నిజ నిర్ధారణ కమిటీ సభ్యులతో సందర్శించి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రతీ కుటుంబానికి ఐదెకరాలిస్తామని రెండెకరాల అటవీ భూమి ఇచ్చారని, డబుల్ బెడ్రూంలు నిర్మించినా నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. గ్రామస్తులు ఇక్కడికి వచ్చిన నుంచి ఎలాంటి ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అటవీ హక్కుల రక్షణ చట్టం ప్రకారం అడవిలో నివసిస్తున్న మానవులను మనుషులుగా గుర్తించాలని కోరారు. అటవీ హక్కుల చట్టం 2006లో ఉన్న అంశాలనూ అధికారులు ధిక్కరించారని ఆరోపించారు. చట్టాన్ని దుర్వినియోగం చేసినందుకు అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వేదిక కార్యవర్గ సభ్యులు రఘోత్తమ్‌రెడ్డి, ప్రజ్ఞశీల్, అతిశ్‌కుమార్, గోపీనాథ్, సోన్ కాంబ్లే తదితరులున్నారు.

ఔట్ సోర్సింగ్ గందరగోళం

- ఆర్టీసీ డ్రైవర్ల ఖాళీలు ప్రకటించని యాజమాన్యం
- దరఖాస్తుల స్వీకరణలో సంస్థల అత్యుత్సాహం



మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో నిలిపి ఉంచిన బస్సులు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీలో కాంట్రాక్టు డ్రైవర్ల నియామకంపై గందరగోళం నెలకొంది. కొత్త డ్రైవర్ల నియామకానికి సమయం పట్టనుండడంతో నాలుగు నెలలపాటు ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల నియామకానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ క్రమంలో ఖాళీలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న వారి జాబితా తెప్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు ఖాళీల భర్తీకి అధికారిక ప్రకటన జారీ చేయకున్నా అవుట్‌సోర్సింగ్ సంస్థలు అత్యుత్సాహం ప్రదర్శించాయి. ఆదిలాబాద్ రీజియన్‌లో ఫిబ్రవరి 28 వరకు గడువు విధిస్తూ టీజీ ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగ దరఖాస్తులు ఆహ్వానించడం చర్చనీయాంశంగా మారింది.

అనుకున్నదొకటి.. అయ్యింది మరొకటి..

టీజీఎస్ ఆర్టీసీలో డ్రైవర్ల కొరతను అధిగమించేందుకు నాలుగు నెలల పాటు అధికారులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి కసరత్తు చేశారు. ఇందులో భాగంగా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న వారి జాబితా తెప్పించుకోవాలని భావించారు. అక్కడ నమోదైన డ్రైవర్లు తక్కువ సంఖ్యలో ఉంటే ఔట్ సోర్సింగ్ సంస్థ నుంచి తీసుకోవాలని ఆలోచించినట్లు తెలుస్తోంది. ఇంకా టెండర్లు పిలవలేదు.. అధికారిక ప్రకటన జారీ చేయకముందే ఔట్ సోర్సింగ్ సంస్థలు సోషల్ మీడియాలో డ్రైవర్ల నియామకం పేరిట విస్తృత ప్రచారం చేపట్టడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

గడువు విధించి.. దరఖాస్తులు స్వీకరించి..

టీజీఎస్ ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగ దరఖాస్తుల ఆహ్వానం అంటూ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ప్రకటనలు గుప్పించాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అయితే ఓ సంస్థ నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భైంసా, ఉట్నూర్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలకు (డ్రైవర్లు) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. పూర్తి వివరాలతో పాటు ఫిబ్రవరి 28న సాయంత్రం వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించడం వెనక ఆంతర్యం ఏమిటో తెలియకుండా పోయింది. అభ్యర్థులు ఉద్యోగం కోసం ఫోన్‌చేస్తే గడువు ముగిసిందని సంస్థ నిర్వాహకులు చెప్పడం కొసమెరుపు.

ఉద్యోగాల పేరిట దందా..

ఆర్టీసీ అధికారికంగా ప్రకటన.. టెండర్ దక్కించుకున్న వారికే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంటుంది. ఇక్కడ మాత్రం ఏదిలేకున్నా ఆయా సంస్థల ప్రతినిధులు దరఖాస్తులు స్వీకరిస్తూ డబ్బులు దండుకున్నట్లు తెలుస్తోంది. ఇదివరకు కార్గో, ఆసుపత్రి, అటెండర్ ఇలా పలు విభాగాల్లో ఔట్ సోర్సింగ్ ద్వారా టెండర్ దక్కించుకున్న నిర్వాహకులు అభ్యర్థులను నియమించడానికి రూ.20 నుంచి రూ.40 వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. వేతనం చెల్లింపుల్లో ఆలస్యమైతే సంస్థ నిర్వాహకులను ప్రశ్నించిన వారిని ఉద్యోగం నుంచి తొలగించి మళ్లీ ముడుపులు చెల్లించిన వారిని తీసుకున్న సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించకుండా అతి తక్కువగా జీతాలు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఔట్ సోర్సింగ్ నిర్వాహకులకు ఆర్టీసీ సంస్థ చెల్లిస్తున్న డబ్బుల్లో వర్కర్‌కు ఇచ్చేది కూడా తక్కువే. ఇదేంటని అడిగితే ఇష్టముంటే ఉద్యోగం చెయ్యి.. లేదంటే వెళ్లిపో అనే వారూ లేకపోలేదు. ఆయా ఔట్‌సోర్సింగ్ సంస్థల నిర్వహణ తీరుపై కార్మికశాఖ అధికారులు కూడా కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ప్రభుత్వ సంస్థల్లోని పలు విభాగాల్లో మ్యాన్‌వల్ సరఫరా చేసే ఔట్ సోర్సింగ్ కార్మికులకు తక్కువ ఆదాయం ఉండగా ఆర్టీసీలో సగానికి బెనిఫిట్ రావడమో ఏమోగానీ ఔట్‌సోర్సింగ్ నిర్వాహకులు ఉత్సాహం చూపిస్తుంటారు. ఒక్కసారి టెండర్ దక్కించుకుంటే అడిగేవారు లేకపోవడంతో ఆడిందే ఆట అన్నట్లు ఔట్ సోర్సింగ్ సంస్థలు వ్యవహరిస్తున్నాయి.

అవసరాన్ని బట్టి నియామకం



టీజీఎస్ ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ ద్వారా డ్రైవర్‌ల నియామకానికి ప్రభుత్వం అనుమతించింది. జిల్లాలో నియామక ప్రక్రియ ఇంకా చేపట్టలేదు. ఖాళీలు ఎన్ని ఉన్నాయో గుర్తిస్తున్నాం. ఎక్కడ అవసరముంటే ఆ డిపోలో ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంటుంది. ఔట్ సోర్సింగ్ సంస్థలు దరఖాస్తులు స్వీకరించిన విషయం మా దృష్టికి రాలేదు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఔట్ సోర్సింగ్ డ్రైవర్లను భర్తీ చేస్తాం. – సోలోమాన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

డ్రైవర్ల కొరతతో..

పదేళ్లకు పైగా ఆర్టీసీలో నియామకం చేపట్టకపోవడంతో డ్రైవర్ల కొరత ఏర్పడుతోంది. డబుల్‌డ్యూటీలు, డ్యూటీ అవర్స్ పెంచడంతో డ్రైవర్లపై పనిభారం పెరుగుతోంది. డ్యూటీ సమయంలో నిద్ర లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అనారోగ్యాలకు గురవుతున్నారు. నిద్రమత్తులో ప్రమాదాలు చేస్తున్నవారూ లేకపోలేదు. ఒక్కో డిపోలో దాదాపు 6 నుంచి 10 బస్సులు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు బస్సుల్లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో రీజియన్ వ్యాప్తంగా దాదాపు 180 మంది డ్రైవర్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్లను నియమిస్తుండగా కొన్ని డిపోల్లో తమనే తీసుకోవాలంటూ హైర్ బస్సు డ్రైవర్లు ఆందోళనకు దిగడంతో తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది.

జాతీయ పోటీలకు ఉపాధ్యాయుడు ఎంపిక



సపావత్ కిషోర్

పెంబి: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొన్న సపావత్ కిషోర్ జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. మండలంలోని లోతర్యతండాకు చెందిన కిషోర్ కడెం మండలంలోని కొత్తమద్దిపడగ ఎంపీయూపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 14 నుంచి 26 వరకు ఢిల్లీలో జరుగనున్న జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నాడు.

అలరించిన అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు



తలపడుతున్న మల్లయోధులు

కుభీర్: మండలంలోని పార్డి(బి) గ్రామంలో రాజరాజేశ్వర జాతరలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు అలరించాయి. మహారాష్ట్రలోని పలు గ్రామాల పాటు జిల్లాలోని వివిధ గ్రామాల మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతికి నాందేడ్ జిల్లా బిద్రెల్లి గ్రామానికి చెందిన సాయినాథ్ ఎంపికై రూ.7వేల నగదు గెలుచుకున్నారు. గ్రామపెద్దలు మోహన్, రాజేశ్వర్, పోశెట్టి, సురేశ్‌బాబు తదితరులున్నారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

సిరికొండ(బోథ్): మండలంలోని సోన్‌పెల్లిలో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన వాగ్మరే మాధవ్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో ఇంటికి నిప్పంటుకుని దగ్ధమైంది. గ్రామంలో జరిగిన ఓ పెళ్లి వేడుకలో పాల్గొన్న బాధిత కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న రూ.1.30 లక్షల నగదుతో పాటు సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వాగ్మరే మాధవ్ కుటుంబం ఇటుక బట్టీలో పనిచేస్తుండగా ఇటీవలే కూలి డబ్బులు ఇచ్చారని, అవి మంటల్లో కాలిపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: భార్య మందలించిందని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. టూటౌన్ ఏఎస్సై ముకుందరావు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా దహెల్లి గ్రామానికి చెందిన నూకల్ వార్ ఓం ప్రకాష్ (35) మద్యానికి బానిసకావడంతో శనివారం అతని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పంట చేనులో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మనస్తాపంతో ఒకరు బలవన్మరణం

తానూరు(ముధోల్): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఉమ్రి(కే) గ్రామానికి చెందిన వాగ్మారే రాహుల్ (35)కు మహారాష్ట్రలోని బారడ్‌కు చెందిన సంగీతతో పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి దంపతులకు సంతానం కలగకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై చీటింగ్ కేసు

ఖానాపూర్: పట్టణంలోని మొగల్‌పురకు చెందిన మహ్మద్ ఇర్షాద్‌తో పాటు మహ్మద్ జియాకు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. నిర్మల్‌కు చెందిన మిరియాల రాజలక్ష్మి, మిరియాల శ్రీనివాస్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై పేర్కొన్నారు.

కవ్వాల్‌లో పక్షుల అరుపుల రికార్డింగ్ నిపుణులు

- పక్షులను గుర్తించే విధానంపై అవగాహన



పక్షుల వాయిస్ రికార్డ్ చేసే విధానం వివరిస్తున్న అర్పిత

జన్నారం: అరుపుల ద్వారా పక్షులను గుర్తించడం, రికార్డు చేసే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసర్చ్(ఐఐఎస్ఈఆర్) తిరుపతికి చెందిన ప్రతినిధులు మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్‌లో ఆదివారం పర్యటించారు. బైసన్ కుంట ప్రాంతంలో అటవీశాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఐఐఎస్ఈఆర్ ప్రతినిధి అర్పిత వారికి రికార్డింగ్ చేసే విధానం , రికార్డు చేసే పరికరాల గురించి వివరించారు. పక్షుల వాయిస్ రికార్డర్‌లను అమర్చి రాత్రి వేళల్లో పక్షుల అరుపులు రికార్డు చేసి, అరుపులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్‌లో పెట్టడం ద్వారా అరిచిన పక్షి, వాటి వివరాలను తెలియజేస్తుందని వివరించారు. కెమరా ట్రాప్ కోసం సీసీ కెమరాలను అమర్చే విధంగా రికార్డింగ్ పరికరాలను కూడా అడవిలో అమర్చి, రికార్డు చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక సిబ్బందితో కలిసి బర్డ్‌వాక్ చేశారు. ఈ సందర్భంగా తాళ్లపేట్, జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్‌ల పరిధిలోని అటవీ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాళ్లపేట్, జన్నారం డీఆర్వోలు సాగరిక, తిరుపతి, ఎఫ్ఎస్‌వో నహీద పర్వీన్, బీట్ అధికారులు లాల్‌బాయి, రుబీనా పాల్గొన్నారు.

తండ్రి ఎదుటే కానరాని లోకాలకు..

- గోదావరిలో మునిగి యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గోదావరి పుష్కర ఘాట్ వద్ద ఆదివారం ఓయువకుడు నీట మునిగి మృతి చెందాడు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ కథనం మేరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌కు చెందిన ఉస్కమల్ల శ్రావణ్ (22) తన తండ్రి రమేశ్‌తో పాటు మరో ఇరువురు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం ముల్కల్ల పుష్కర ఘాట్ తీరానికి గోదావరి స్నానానికి వచ్చారు. అందరి స్నానాలు ముగిసిన తర్వాత చివరిగా శ్రావణ్ వెళ్లి సరదాగా నీటిలో ఆడుతూ లోతుకు వెళ్లడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన తండ్రి తేరుకునేలోపే నీటిలో గల్లంతయ్యాడు. స్థానిక మత్స్యకారులసాయంతో బయటకు తీసుకువచ్చి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుని తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పర్యావరణంలో పక్షులది కీలకపాత్ర



హాజరైన అటవీశాఖ అధికారులు



పీసీసీఎఫ్ (కంపా)కు జ్ఞాపిక అందజేస్తున్న ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో

- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ
- మంచిర్యాలలో ముగిసిన బర్డ్ ఫెస్టివల్

జన్నారం(ఖానాపూర్):పర్యావరణంలో పక్షులది కీలక పాత్ర అని, మిగిలిన జీవరాశులకన్నా ఎంతో జీవ వైవిధ్యం కలిగిన పక్షుల సంరక్షణపై సమగ్ర అధ్యయనం జరగాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (కంపా) డాక్టర్ సువర్ణ అన్నారు. అటవీశాఖ, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్, నేచర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంచిర్యాలలో రెండు రోజులు నిర్వహించిన బర్డ్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో పీసీసీఎఫ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పక్షుల గమనానికి పరిధులు లేవని, అవి ఖండాలు దాటి ప్రయాణిస్తూ పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. పర్యావరణ మార్పులతో కొన్ని జాతులు వేల కిలోమీటర్లు కూడా వలస వెళ్తాయన్నారు. ఇలాంటి పక్షులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే పక్షుల గురించి తెలుసుకోవాలని సూచించారు. జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వేల పక్షులు సంచరిస్తున్నాయన్నారు. రెండేళ్లుగా వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ సహకారంతో జన్నారం అటవీ డివిజన్‌లో దీర్ఘకాలిక పరిశీలన చేసి 201 జాతుల పక్షులను గుర్తించామన్నారు. జిల్లా పరిధిలోని మిగిలిన అటవీ డివిజన్లలో కూడా పక్షుల గమనాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రికార్డు చేసుకోవాలని సూచించారు. బర్డ్ ఫెస్టివల్ సందర్భంగా పక్షుల సంరక్షణలో సేవలందిస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, కవ్వాల్ టైగర్ రిజర్వ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారాం కలిసి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ అధికారి నీరజ్ టిబ్రేవాల్, నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్స్ శాస్త్రవేత్త మహేశ్ శంకరన్, తమిళనాడుకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ రాబిన్ విజయన్, బీఎన్‌హెచ్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సాథియా సెల్వం, వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ ప్రధాన అధికారి బండి రాజశేఖర్, ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి ప్రశాంత్‌కుమార్ పాటిల్, మంచిర్యాల ఫారెస్ట్ డివిజనల్ అధికారి సర్వేశ్వర రావు, పక్షులపై అధ్యయనం చేస్తున్న ప్రముఖులు డాక్టర్ శాంతారాం, డాక్టర్ భిక్షం గుజ్జ, డాక్టర్ సాథియా సెల్వం, సంజీవ్ మీనన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఫారెస్ట్ రేంజ్ అధికారులు, డిప్యూటీ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో ఒకరు మృతి



ముత్యం మృతదేహం

లక్ష్మణచాంద (నిర్మల్): ఫిట్స్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన చిటి ముత్యం (38) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో ట్రాక్టర్ పై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుమలత

లక్ష్మణచాంద(నిర్మల్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన చెలిమల రాజు (35) ఆదివారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై కనకాపూర్ వెళ్లి వస్తుండగా నర్సాపూర్ చెక్‌పోస్టు వద్ద ఖానాపూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బొలెరో అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో రాజు తలకు తీవ్రగాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఎస్సై సుమలత సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతికి కారణమైన బొలెరో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు ఆటోలు ఢీకొని ఒకరు..



పెంటయ్య (ఫైల్)

భీమారం: భీమారం మండలం మద్దికల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, హెడ్‌కానిస్టేబుల్ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం మద్దికల్‌కు చెందిన చింతం పెంటయ్య (60) మరికొందరు భీమారం నుంచి మద్దికల్ వైపు ఆటోలో వెళ్తుండగా చెన్నూరు మండలం నారాయణపూర్ నుంచి బెల్లంపల్లివైపు వెళ్తున్న ఆటో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఘటనలో చింతం పెంటయ్య అక్కడికక్కడే మృతి చెందగా అందులో ప్రయాణిస్తున్న సంధ్యారాణి, కుమ్మరి శేఖర్, కుమ్మరి భాగ్య, కుమ్మరి రోహిత్, ఆటోడ్రైవర్లు దాగం సర్వేశ్వర్, ఆకుదారి సారయ్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి క్షతగాత్రులను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. భీమారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు.

రెస్క్యూ సిబ్బందికి సదుపాయాలు కల్పించాలి

శ్రీరాంపూర్: ఎస్ఎల్‌బీసీలో రెస్క్యూ సేవలు అందించడానికి వెళ్లిన సింగరేణి ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బండి రమేశ్, నాయకులు పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి నుండి సుమారు 200 మంది ఉద్యోగులు, రెస్క్యూ సభ్యులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని, వారికి కనీస వసతులు లేవని, తాగునీరు, భోజనం సరిగా లేదని, బస చేయడానికి వసతులు అధ్వానంగా ఉన్నాయన్నారు. ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేస్తున్న వారికి స్పెషల్ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై యజమాన్యం తక్షణమే స్పందించాలన్నారు.

ఒత్తిడి తట్టుకోలేక‘పోతున్నా’

- చిట్టి, మమ్మీ, డాడి, తమ్ముడు క్షమించండి..
- ఉరేసుకుని ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య
- సూసైడ్ నోట్ రాసి అఘాయిత్యం



ఉపాధ్యాయుడు సంతోష్ (ఫైల్)

చెన్నూర్:విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాడు. జీవితంలో సమస్యలను ఎలా అధిగమించాలో బోధించాడు. పిల్లల భవిష్యత్‌కు బాటలు వేసే ప్రయత్నం చేశాడు. కానీ, చివరకు ఆయనే ఒత్తిడి తట్టుకోలేక తనువు చాలించాడు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, కాలనీ వాసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూర్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న ఆదిలాబాద్‌కు చెందిన తాప్రె సంతోష్(40) వేమనపల్లి మండలం కల్మలపేట ప్రాథమిక పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం భార్య మాలతి, కుమారుడు, కుమార్తెను స్వగ్రామం ఆదిలాబాద్‌లో దింపి వచ్చాడు. శని, ఆదివారం ఇంటి తలుపులు తెరవకపోవడంతో చుట్టు పక్కలవారు సాయంత్రం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటేశ్వర్ రావు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టాడు. లోనికి వెళ్లి చూడగా సంతోష్ చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని కిందికి దింపి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంతోష్ భార్య, కుటుంబ సభ్యులు పోలీసులు సమాచారం అందించారు. గదిలో లభించిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

చిట్టి, మమ్మి, డాడీ, తమ్ముడు క్షమించండి..

పోలీసులు స్వాధీనం చేసుకున్న సూసైడ్ నోట్‌లో ‘చిట్టి, మమ్మి, డాడీ, తమ్ముడు నన్ను క్షమించండి. డిప్రెషన్ తట్టుకోలేక పోతున్న’ అని సూసైడ్ నోట్ రాసి ఉంది. కాగా, సంతోష్ 317 జీవో కారణంగా కల్మలపేటకు బదిలీపై వచ్చాడని, అప్పటి నుంచే ఒత్తిడికి లోనవుతున్నాడని ఉపాధ్యాయ సంఘం నాయకులు పేర్కొంటున్నారు. ఇటీవల 317 జీవో బాధితులకు అవకాశం కల్పించినా సంతోష్‌కు ఛాన్స్ రాలేదని తెలిసింది.

ఐఎంఏ కమిటీలో నిర్మల్ డాక్టర్‌కు స్థానం

- ఎథిక్స్ స్టాండింగ్ కమిటీ కన్వీనర్‌గా నియామకం



డాక్టర్ చక్రధారి

నిర్మల్‌ఖిల్లా: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అల్లోపతి వైద్య నిపుణుల జాతీయ స్థాయి సంఘంలో మెడికల్ ఎథిక్స్ స్టాండింగ్ కమిటీ కన్వీనర్‌గా నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు అప్పాల చక్రధారి నియమితులయ్యారు. భారత జాతీయ స్థాయిలో 3.67లక్షలకు పైగా సభ్యులు కలిగిన అతిపెద్ద అల్లోపతి వైద్య నిపుణుల సంఘంలో మెడికల్ ఎథిక్స్ స్టాండింగ్ కమిటీ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. అల్లోపతి వైద్యుల నైతిక విలువల ఆచరణ క్రమాన్ని పర్యవేక్షిస్తూ, వైద్య వృత్తి విలువలను సంరక్షించే కార్యక్రమాలను చేపట్టేందుకు జాతీయస్థాయిలో స్టాండింగ్ కమిటీ ఫర్ ఎథిక్స్ క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. కాగా, దీనికి కన్వీనర్‌గా ప్రముఖ సీనియర్ వైద్య నిపుణుడు, ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న చక్రధారిని నియమిస్తున్నట్లు ఐఎంఏ జాతీయాధ్యక్షుడు దిలీప్‌కుమార్ బన్సాలి ప్రకటించారు. కాగా, చక్రధారిని జిల్లా వైద్యులు ప్రత్యేకంగా అభినందించారు. తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ స్థాయి కార్యవర్గ సభ్యులకు చక్రధారి కృతజ్ఞతలు తెలిపారు.

కాలనీ రోడ్డుపై దూసుకెళ్లిన వ్యాన్

గుడిహత్నూర్(బోథ్): మండల కేంద్రంలోని ముత్నూర్ వెళ్లే రోడ్డుపై ఓ వ్యాన్ దూసుకెళ్లడంతో పలు దుకాణాలు, ఇళ్లకు చెందిన విద్యుత్ వైర్లు తెగిపోవడంతో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడింది. దీంతో మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెదురు లోడుతో భారీ ఎత్తులో వెళ్తున్న వ్యాన్ డ్రైవర్ గుడిహత్నూర్‌లో తన ఇంటి వద్ద వాహనం నిలపడానికి అటు వైపుగా వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. వ్యాన్ వెళ్తున్న క్రమంలో డ్రైవర్ విద్యుత్ తీగలను గమనించకుండా తోలడంతో ఘటన చోటు చేసుకుంది. స్థానికులు బయటకు రావడంతో డ్రైవర్ భయపడి పారిపోయాడు. విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపి వేసి ఎలాంటి ప్రాణనష్టం కలగకుండా నివారించారు.



తెగిన తీగలు చూపిస్తున్న కాలనీ వాసులు